# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 4 | సంచిక: 121 | పేజీలు: 6 | వెల: రూ.3/- | సోమవారం 10 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# హైదరాబాద్‌లో బోనాల జాతర

## పూజలు నిర్వహించిన కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ ప్రముఖులు





**హైదరాబాద్, ఆగస్టు 9 (ప్రభాత ఉదయం)**

ఆషాఢమాసం బోనాల జాతరలో ఆదివారం ప్రధాన ఘట్టానికి అంకురార్పణ జరిగింది. లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళికి భక్తులు బోనాలు సమర్పిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పట్టు వస్త్రాలు సమర్పించారు. నగరంలోని ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పుదరువులతో దద్దరిలిల్లాయి. పాతబస్తీలోని లాల్ దర్వాజ సింహవాహిని మహంకాళి, అక్కన్న మాదన్న ఆలయం, మీరాలం మండి మహంకాళి, బేలా ముత్యాలమ్మ, ఉప్పుగూడ మహంకాళి ఆలయాలతో పాటు అన్ని దేవాలయాల్లో అమ్మవార్లకు బోనాలు సమర్పించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. రాత్రి 8 గంటలకు శాంతి కల్యాణం నిర్వహించారు. ఆషాఢ బోనాల ..మిగతా 2లో




పోలీస్ అమరుల కోసం... ప్రత్యేక పోర్టల్

# 'టీజీ వీర్'

**నక్సల్స్ ప్రభావం తగ్గడంతో అభివృద్ధి పై దృష్టి సారించిన ప్రభుత్వం**

**ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విభాగం**

**టి జి వీర్ పోర్టల్ ప్రారంభోత్సవంలో డిజిపి సివి ఆనంద్**

**వరంగల్ ఆగస్టు 9 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రంలో పోలీస్ అమరవీరుల కుటుంబాల కోసం టీజీ– వీర్ అనే యాప్ ను వరంగల్ లో ప్రారంభించామని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. కాజీపేట ఎన్ఐటీలో ఆదివారం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అధికారులతో సమీక్ష అనంతరం విలేకరులతో మాట్లాడారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు అప్పటి ప్రభుత్వాలు ఆదుకున్నాయని అన్నారు. ఇంకా మిగిలిన సమస్యలను పరిష్కరించేందుకే ఈ టీజీ–వీర్ యాప్ పనిచేస్తుందన్నారు. ఆయా స్టేషన్ల పరిధిలో అధికారులు, అమరవీరుల కుటుంబాలు వారి సమస్యలను క్యూఆర్ కోడ్ ద్వారా ఈ యాప్ లో పెట్టవచ్చన్నారు. వారి కోసమే దీన్ని వరంగల్ లో ప్రారంభించామని తెలిపారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు సంబంధించి ఎక్స్ గ్రేషియా, ఆర్థిక సహాయం, ఇండ్ల స్థలాలు, పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలకు సంబంధించి సమస్యలను పెట్టవచ్చన్నారు. మొదట చనిపోయిన కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా తక్కువ వచ్చిందని తమ దృష్టికి తెచ్చారన్నారు. ఇంటి స్థలాల సమస్య ఉ ందన్నారు.రాష్ట్రంలో ప్రస్తుతం మావోయిస్టుల ప్రభావం లేదని డీజీపీ అన్నారు. ఏజెన్సీ ప్రాంతాలు ప్రస్తుతం ప్రశాంతంగా ఉన్నాయన్నారు. మావోయిజం తగ్గిన తర్వాత అభివృద్ధిపై దృష్టి పెడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో 2010 నుంచే మావోయిస్టు ప్రభావం తగ్గిన పక్కనే ఉన్న ఛత్తీస్ ఘడ్, మహారాష్ట్రలో కొంత ఉండేదన్నారు. అది కూడా ప్రస్తుతం తగ్గి పోయిందన్నారు. సెంట్రల్ కమిటీ నేతలు ..మిగతా 2లో




ఆపరేషన్ సిందూర్‌తో బ్రహ్మోస్‌కు

# భారీ డిమాండ్

**బ్రహ్మోస్‌కు ప్రపంచవ్యాప్తంగా పెరిగిన గిరాకీ**

**కొనుగోలుకు క్యూ కడుతున్న దేశాలు!**

**పాక్ వద్ద ఉన్న చైనా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను విజయవంతంగా ఛేదించిన క్షిపణి**

**వియత్నాం, ఇండోనేషియాతో వందల మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు ఖరారు**

2లో..

నేటితో ముగియనున్న..

# ఎస్ఐఆర్ గడువు

## 74లక్షల ఓట్ల కోత!





**హైదరాబాద్, ఆగస్టు 9 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే(సర్) కార్యక్రమం సోమవారం ముగియనుంది. ఈ ఏడాది జూన్ లో ఓటరు ప్రక్రియ మొదలు కాగా అప్పటినుంచి పలు కారణాలతో ఆ సర్వేను అధికారులు పొడిగిస్తూ వచ్చారు. బీఎల్‌వోలకు అందిన దరఖాస్తుల పరిశీలన అనంతరం హైదరాబాద్ నగరంలో ఓటర్ల సంఖ్య భారీ స్థాయిలో తగ్గనున్నట్టు తెలుస్తోంది. శనివారం సాయంత్రం వరకు నమోదైన లెక్కల ప్రకారం రాజధానిలోని మూడు జిల్లాల్లో 28 నియోజకవర్గాల్లో ఇప్పటికే 1.14 కోట్ల ఓటర్లు ఉన్నారు. వారిలో 40 లక్షల ఓట్లు గల్లంతు కానున్నట్లు అంచనా వేస్తున్నారు.

**17న ముసాయిదా ఓటరు జాబితా**

ఆది, సోమవారాల్లో ప్రభుత్వ సెలవు అయినప్పటికీ బీఎల్‌వోలు , అలాగే ఉన్నతాధికారులు విధులకు హాజరవుతారని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ..మిగతా 2లో




2లో..

నల్సార్ స్నాతకోత్సవానికి

# సీజేఐ వద్దు

**నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ సూర్యకాంత్‌ను పిలవొద్దని విద్యార్థుల డిమాండ్**

**దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి యాజమాన్యానికి లేఖ అందజేశారు**

**నీట్ నిరసనలపై సీజేఐ చేసిన వ్యాఖ్యలే అభ్యంతరాలకు కారణంగా వెల్లడి**

**ఇటీవలే ముంబై టిస్‌లోనూ ఇదే తరహా నిరసనలతో స్నాతకోత్సవం వాయిదా**



ఇజ్రాయెల్‌లో మిలిటరీ

# సెలవులు రద్దు

## ఇరాన్‌పై దాడుల కోసమేనా.?

**న్యూఢిల్లీ, ఆగస్టు 9 (ప్రభాత ఉదయం)**

ఇజ్రాయెల్ లో సైనికులను ఉన్న అన్ని సెలవులను ఆ దేశ ఆర్మీ రద్దు చేసినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే సెలవుల్లో ఉన్న వారు వెంటనే తిరిగి సైన్యంలో చేరాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇజ్రాయెల్ మళ్లీ ఇరాన్‌పై కొత్త దాడులు ప్రారంభించనుందా అనే అనుమానం ..మిగతా 2లో

## కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బండి సంజయ్ తీవ్ర విమర్శలు



2లో..

# పెద్ది కుటుంబానికి కేసీఆర్ పరామర్శ

## రూ.2.25 కోట్ల చెక్కు అందజేత



**వరంగల్ ఆగస్టు 9 (ప్రభాత ఉదయం)**

దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. నల్ల బెల్లిలో నిర్వహించిన దశదిన కార్యక్రమానికి హాజరైన కేసీఆర్.. పెద్ది చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెద్ది కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చిన కేసీఆర్.. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ తరపున పెద్ది కుటుంబానికి రూ. 2. 25 కోట్ల ..మిగతా 2లో

# పోలీస్ అమరుల కోసం... ప్రత్యేక పోర్టల్ 'టీజీ వీర్'

**మొదటి పేజీ తరువాయి...**

లొంగిపోవడం, కొంత మంది ఎన్కౌంటర్ కావడం వల్ల ప్రభావం తగ్గిందన్నారు. లొంగిపోయిన నక్సల్స్ కోసం మెరుగైన పునరావాసం కల్పించేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే వారికి తగిన సహాయం అందించామన్నారు. వారు స్వస్తిగా నిలబడేందుకు తోడ్పాటును అందిస్తామని తెలిపారు.రాష్ట్రంలో నేరాల ట్రెండ్ మారిందన్నారు. గంజాయి రవాణా ఎక్కువగా ఉందన్నారు. రాష్ట్రంలో ఈగల్ ద్వారా గంజాయికి అడ్డుకట్ట వేస్తున్నామన్నారు. వేరే ప్రాంతాల నుంచి రాష్ట్రానికి వస్తున్న కట్టడి చేస్తున్నామన్నారు. చిన్న పిల్లలకు కూడా చాక్లెట్ల రూపంలో డ్రగ్స్ అందిస్తున్నారని అన్నారు. సమాజంలో అందరూ డ్రగ్స్ ను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. వ్యాపారులు, చిరు ఉద్యోగులు అత్యాశకు పోయి



మోసాలకు గురవుతున్నారని అన్నారు. డబ్బును చూపెట్టి సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని మోసపోయిన తర్వాత డబ్బులను తిరిగి తీసుకురావడం కష్టంగా ఉందని తెలిపారు. వీటిపైన అవగాహన తెచ్చుకొని మోసానికి గురి కాకుండా చూసుకోవాలన్నారు. సైబర్ క్రైమ్, నార్కోటిక్స్ నియంత్రణకు సరికొత్త బ్యూరోలను ఏర్పాటు చేసి పని చేస్తున్నామన్నారు. పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలను తగ్గించేందుకు రోడ్ సేఫ్టీ కోసం ప్రత్యేక విభాగాన్ని త్వరలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కల్తీ ఆహారం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు ఫుడ్ సేఫ్టీ కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నిఘా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. టెక్నాలజీ పెరిగినా బేసిక్ పోలిసింగ్ ను మరువద్దన్నారు. విలేకరుల సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎం.శ్వేత, ఎస్పీలు రూపేష్, సాయిశ్రీ, గిరిధర్, శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో
# బోనాల జాతర

**మొదటి పేజీ తరువాయి...**

ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గోల్కొండలో 8వ బోనం పూజ నిర్వహించారు. ఉదయం 6 గంటలకు శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అంబర్ పేటలో నిర్వహించిన మహంకాళి బోనాలలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి సీతక్క పొన్నం ప్రభాకర్, పూజలు నిర్వహించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, వి హనుమంతరావు కేటీ రామారావు.

## ఇజ్రాయెల్‌లో మిలిటరీ
# సెలవులు రద్దు

**మొదటి పేజీ తరువాయి...**

వ్యక్తమవుతోంది. ఇరాన్‌పై మొదటిసారి దాడులు చేపట్టడానికి కొన్ని గంటల ముందు కూడా ఆ దేశం సైనికులకు ఇటువంటి ప్రకటనే చేసింది. దీంతో ఇప్పుడు కూడా పెద్ద స్థాయిలో దాడులు చేపట్టడానికి ఆ దేశ సైన్యం సిద్ధమయ్యే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. యుద్ధం కారణంగా గగనతల రక్షణ వ్యవస్థల కొరత ఏర్పడుతుండడంతో.. దాడులను ఆపివేయాలని అమెరికా భావిస్తోంది. అయితే నెతన్యాహు మాత్రం యుద్ధం కొనసాగించడానికే మొగ్గు చూపుతున్నారని స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. అమెరికా సాయం లేకుండా సొంతంగా టెహ్రాన్‌పై విరుచుకుపడడానికి సైన్యం సన్నాహాలు కూడా ప్రారంభించినట్లు తెలిపాయి. ఇరాన్‌లోని కీలక నేతలు, ఐఆర్‌జీసీ అధికారులే లక్ష్యంగా దాడులు చేయడానికి ఇప్పటికే నెతన్యాహు సైనికాధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

**ట్రంప్ శాంతి ప్రణాళికలను వ్యతిరేకించిన నెతన్యాహు..**

ఇరాన్‌తో యుద్ధం ముగింపు, గాజాలో దాడుల నిలుపుదల కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన 15 పాయింట్ల ప్రణాళికను నెతన్యాహు వ్యతిరేకించారు. గాజా విషయంలో అగ్రరాజ్య ప్రతిపాదనలను అంగీకరించబోమని.. హమాస్ పూర్తిగా ఆయుధాలు విడిచిపెట్టేంతవరకు వెనక్కి తగ్గబోమని ప్రకటించారు

**దాడులు చేస్తే.. ప్రతీకారం తీర్చుకుంటాం: ఇరాన్**

ఇజ్రాయెల్ మరోసారి తమపై దాడి చేస్తే.. తీవ్ర స్థాయిలో విరుచుకుపడతామని ఇరాన్ శనివారం హెచ్చరించింది. టెల్ అవీవ్‌లోని చమురు రిఫైనరీలు, కీలక కార్యాలయాలను లక్ష్యం చేసుకుంటామని పేర్కొంది. వ్యూహాత్మక హర్మ్యూజ్ ప్రాంతం నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని అమెరికాకు సూచించింది. ఇరాన్‌పై యుద్ధాన్ని శాశ్వతంగా ముగించాలని.. దాడుల కారణంగా జరిగిన నష్టానికి పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది.



# కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బండి సంజయ్ తీవ్ర విమర్శలు

హైదరాబాద్, ఆగస్టు 9 (ప్రభాత ఉదయం)

బోనాల ఉత్సవాల సందర్భంగా కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల పై తీవ్రవిమర్శలు చేశారు. హిందూ సమాజం, సనాతన ధర్మం విషయంలో ఆ రెండు పార్టీలు సంతుష్టీకరణ రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. బీజేపీ మాత్రం సంతుష్టీకరణ రాజకీయాలకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన ప్రభుత్వం ఉత్సవాల నిర్వహణకు తగినన్ని నిధులు కేటాయించడం లేదని బండి సంజయ్ విమర్శించారు. హైదరాబాద్‌లో వేలాది ఆలయాలు ఉన్నప్పటికీ బోనాల ఉత్సవాలకు కేటాయిస్తున్న నిధుల పై ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. ఇతర పండుగలకు కేటాయించే నిధులతో పోల్చితే బోనాలకు ఎందుకు తక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రశ్నించారు.

**చరిత్రను వాస్తవ కోణంలో బోధించాలి**

తెలంగాణ సాయుధ పోరాట యోధుల చరిత్రను పాఠ్యాంశాల్లో ఎందుకు చేర్చలేదని బండి సంజయ్ ప్రశ్నించారు. చరిత్రను వాస్తవ కోణంలో భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. టిప్పుసుల్తాన్ అంశాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ వైఖరి పై విమర్శలు చేశారు. అయోధ్య రామమందిర నిర్మాణాన్ని కాంగ్రెస్ నేతలు వ్యతిరేకించడం పై కూడా ఆయన ప్రశ్నలు సంధించారు. హిందూ సమాజానికి సంబంధించిన సమస్యలను ప్రశ్నిస్తే వాటికి మతం రంగు పులమడం సరికాదని అన్నారు. ఆలయాల పరిరక్షణ, గోరక్షణ, హిందువుల భద్రత వంటి అంశాలపై తాను నిరంతరం మాట్లాడుతూనే ఉంటానని స్పష్టం చేశారు. సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**'బోనాలకు ఎన్నికలకు సంబంధం లేదు'..**

తాను ప్రతి ఏడాది బోనాల ఉత్సవాల్లో పాల్గొంటున్నానని, బోనాలకు ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదని బండి సంజయ్ పేర్కొన్నారు. బీజేపీ స్వచ్ఛంద సంస్థ కాదని, ప్రజా సమస్యలపై పోరాడే రాజకీయ పార్టీ అని అన్నారు. హిందూ సమాజం మరింత చైతన్యవంతం కావాల్సిన అవసరం ఉందన్నారు.

**నిరుద్యోగం, ఉద్యోగాలపై ప్రభుత్వాన్ని నిలదీత..**

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని బండి సంజయ్ ఆరోపించారు. హైడ్రాలో కేవలం 150 పోస్టుల భర్తీకి నిర్వహించిన ఫిజికల్ టెస్ట్‌కు సరూర్‌నగర్ స్టేడియం యువతతో నిండిపోవడం పరిస్థితికి అద్దం పడుతోందన్నారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఉద్యోగాలు భర్తీ చేసే వరకు నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి ఇస్తామన్న హామీని కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రోజ్‌గార్ మేళాల ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగ నియామకాలు చేపట్టిందని పేర్కొన్నారు.

## నేటితో ముగియనున్న..
# ఎస్ఐఆర్ గడువు

**మొదటి పేజీ తరువాయి...**

తెలిపారు. ఇంకా ఎన్యుమరేషన్ ఫారాలు అందించని వారు ఎవరైనా ఉంటే వెంటనే అధికారులకు సమర్పించాలని

**మొదటి పేజీ తరువాయి...**

ఆయన సూచించారు. మరోవైపు ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**సనత్‌నగర్‌లో దాదాపు సగం ఓట్లు**

క్యూర్ పరిధిలోని చేవెళ్ల, కల్వకుర్తి, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో రద్దయ్యే ఓట్లను మినహాయించాలి. మిగిలిన 25 నియోజకవర్గాల్లో ఇబ్రహీంపట్నంలో 21.43 శాతం, బహదూర్‌పురలో 22.38 శాతం ఓట్లు అత్యల్పంగా రద్దు కానున్నాయని అంచనా. అయితే సనత్‌నగర్ నియోజకవర్గం విషయానికొస్తే అక్కడ మొత్తం 2,54,030 ఓట్లు ఉన్నాయి. వాటిలో 1.16 లక్షల ఓట్లు అంటే 45.68 శాతం ఓట్లు రద్దు కాబోతున్నాయని సమాచారం. రానున్న రెండురోజుల్లో ఓటరు సంఖ్య ఒక శాతం పెరగటం లేదా తగ్గడం మాత్రమే జరుగుతుందని తెలుస్తోంది. ఎందుకంటే బోనాల పండుగ ఉండటం వల్ల ఎక్కువ మొత్తంలో హెచ్చుతగ్గులు ఉండవని అధికారులు అంచనా వేస్తున్నారు.

**రాజధానిలో రద్దయ్యే ఓట్లు(శాతాల్లో)**

హైదరాబాద్‌లో మలక్‌పేట్- 33.92, సనత్‌నగర్- 45.68, ముషీరాబాద్- 39.77, జూబ్లీహిల్స్- 44.21, అంబర్‌పేట్- 36.17, గోషామహల్- 39.38, ఖైరతాబాద్-36.78, సికింద్రాబాద్- 38.47, కార్వాన్- 33.23, చార్మినార్- 32.49, నాంపల్లి- 31.33, బహదూర్‌పుర- 22.38, కంటోన్మెంట్‌లో35.31, యాఖుత్‌పుర- 31.40, చాంద్రాయణగుట్ట- 32.57 శాతం. రంగారెడ్డి జిల్లాలో ఇబ్రహీంపట్నం- 21.43, ఎల్బీనగర్- 42.19, మహేశ్వరం- 40.03, రాజేంద్రనగర్- 38.14, శేరిలింగంపల్లి- 36.60, చేవెళ్ల- 19.31, కల్వకుర్తి- 11.65, షాద్‌నగర్- 14.56 శాతం రద్దు కానున్నాయి.

మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్- 29.30, మల్కాజిగిరి- 37.30, కుత్బుల్లాపూర్- 35.99, కూకట్‌పల్లి- 32.81, ఉప్పల్‌లో 40.05 శాతం ఓట్లు రద్దు కానున్నాయి.

అధికంగా రాజధానిపై ప్రభావం

రోజూ వేల మంది నగరానికి వలస వస్తుంటారు. వారు కొన్నాళ్లకు అక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో వాళ్లు నగరంలో కూడా ఓటరు గుర్తింపు తీసుకుంటున్నారు. ప్రస్తుతం అన్ని రాష్ట్రాల్లోనూ ఓటరు సర్వే జరుగుతోంది. ఈ క్రమంలో రెండు ఓట్లు కలిగిన ప్రజలు నగరంలో ఎన్యూమరేషన్ ఫారాలను అధికారులకు తిరిగివ్వలేదు. ప్రధానంగా సొంతూరిలోనే ఓటు హక్కు కొనసాగేలా చూస్తున్నారు.

దాంతో శివారు నియోజకవర్గాలు, ప్రధాన నగరంలో లక్షల మంది ఫారాలను పక్కన పెట్టేశారు. కొన్ని ఘటనల్లో అధికారుల నిర్లక్ష్యం కూడా ఉందని తెలుస్తోంది.

# నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ వద్దు

హైదరాబాద్, ఆగస్టు 9 (ప్రభాత ఉదయం)

హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన గళం విప్పారు. ఈ మేరకు దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి విశ్వవిద్యాలయ యాజమాన్యానికి ఒక లేఖ రాశారు. ఈ పరిణామం తెలంగాణ న్యాయ విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

వివరాల్లోకి వెళితే, 2026 బ్యాచ్ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రతిపాదనను విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఢిల్లీలో జరిగిన నీట్ నిరసనలపై సుప్రీంకోర్టులో జూలై 22న జరిగిన విచారణ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం చేసిన వ్యాఖ్యలే ఈ నిరసనకు ప్రధాన కారణం. ఆ రోజు విచారణ సందర్భంగా, నిరసనకారులపై పోలీసుల చర్యకు సంబంధించిన వీడియోలపై సుమోటో విచారణ చేపట్టడానికి ధర్మాసనం నిరాకరించింది. ఈ క్రమంలో సీజేఐ, "వీడియోలు చూసే ఆసక్తి మాకు లేదు," "మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి" వంటి వ్యాఖ్యలు చేశారని విద్యార్థులు తమ లేఖలో పేర్కొన్నారు. సీజేఐ వ్యాఖ్యలు అసంబద్ధంగా, బాధ్యతారహితంగా ఉన్నాయని, అందుకే ఆయనను స్నాతకోత్సవానికి పిలవరాదని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్‌కు మద్దతుగా విద్యార్థులు ఇప్పటికే ఒక పూట భోజనం చేయకుండా నిరసన తెలిపారు. తమ అభ్యర్థనను యాజమాన్యం పట్టించుకోకపోతే, వారం రోజుల నోటీసు ఇచ్చి ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే, నల్సార్ యాజమాన్యం స్నాతకోత్సవం తేదీని గానీ, ముఖ్య అతిథిని గానీ అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. కానీ, ప్రతి ఏటా సీజేఐని స్నాతకోత్సవానికి ఆహ్వానించడం నల్సార్‌లో ఒక సంప్రదాయంగా వస్తోంది.

కాగా, సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ విద్యార్థుల నిరసనను ఎదుర్కోవడం ఇది రెండోసారి. ఈ నెల మొదట్లో ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (౧×ూూ)లో జరగాల్సిన 86వ స్నాతకోత్సవానికి కూడా ఆయనే ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉంది. అయితే, ఎస్ఎఫ్ఐ అనుబంధ విద్యార్థులు నిరసన తెలిపే అవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో ఆ కార్యక్రమాన్ని చివరి నిమిషంలో వాయిదా వేశారు. ఇప్పుడు టిస్ తర్వాత నల్సార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం కావడం గమనార్హం. విద్యార్థుల లేఖతో నల్సార్ యాజమాన్యం ఇప్పుడు ఇరకాటంలో పడింది.

# పెద్ది కుటుంబానికి కేసీఆర్ పరామర్శ

**మొదటి పేజీ తరువాయి...**



ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కును అందించారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదిన కార్యక్రమం సందర్భంగా ఆదివారం వరంగల్ జిల్లా నల్లబెల్లిలోని ఆయన స్వగృహానికి కేసీఆర్ వెళ్లారు. పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతితో తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులను కేసీఆర్ ఓదార్చారు. ఆ కుటుంబం కష్ట సమయంలో పార్టీ అండగా ఉంటుందని.. ఎలాంటి అవసరం వచ్చినా బీఆర్ఎస్ పార్టీ సహకరిస్తుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు. పిల్లల భవిష్యత్తు, చదువులు, కుటుంబ సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని హామీ ఇచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ తరఫున రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందించనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. ఈ మేరకు కేసీఆర్ కుటుంబ సభ్యులకు రూ.2.25 కోట్ల చెక్కును అందజేశారు. ఇందులో పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున ఇవ్వనున్నారు.

# ఆపరేషన్ సిందూర్‌తో బ్రహ్మోస్‌కు భారీ డిమాండ్

**మొదటి పేజీ తరువాయి...**

భారత అమ్ములపొదిలోని బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణికి అంతర్జాతీయంగా గిరాకీ అమాంతం పెరిగింది. ముఖ్యంగా, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఈ క్షిపణి చూపిన అద్భుతమైన పనితీరు, దాని కచ్చితత్వం, విధ్వంసక శక్తి ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించాయి. ఈ ఆపరేషన్ తర్వాత బ్రహ్మోస్ కొనుగోలుకు పలు దేశాలు తీవ్ర ఆసక్తి చూపుతుండగా, ఇప్పటికే కొన్ని దేశాలతో భారీ ఒప్పందాలు కూడా ఖరారయ్యాయి. 'ది వీక్' పత్రిక ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం, ఈ క్షిపణి కొనుగోలుకు చర్చలు వేగవంతమయ్యాయి.

2022 జనవరిలో ఫిలిప్పీన్స్‌తో 375 మిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకున్న భారత్, ఆపరేషన్ సిందూర్ తర్వాత మరిన్ని విజయాలు సాధించింది. వియత్నాం సుమారు 629 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని ఖరారు చేయగా, ఇండోనేషియా కూడా 200 నుంచి 300 మిలియన్ డాలర్ల మధ్య విలువైన ఒప్పందాన్ని ఖరారు చేసుకుంది. యూరప్, పశ్చిమాసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికాకు చెందిన డజనుకు పైగా దేశాలు కూడా బ్రహ్మోస్ కొనుగోలుపై ఆసక్తి వ్యక్తం చేస్తున్నాయి.

**ఆపరేషన్ సిందూర్‌తో పెరిగిన ప్రతిష్ఠ**

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే), పాకిస్థాన్‌లోని కీలక ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా, భారత వాయుసేన విమానాలు అంతర్జాతీయ




సరిహద్దు దాటకుండానే సుమారు 15 బ్రహ్మోస్ క్షిపణులను పాక్ సైనిక స్థావరాలపై ప్రయోగించాయి. ఈ దాడుల కచ్చితత్వం, తీవ్రత పాకిస్థాన్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. ముఖ్యంగా, పాకిస్థాన్ మోహరించిన చైనా నిర్మిత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను బ్రహ్మోస్ విజయవంతంగా ఛేదించడం ఒక కీలక పరిణామం. ఈ క్షిపణి దాడుల ధాటికి తట్టుకోలేకే పాకిస్థాన్ వెంటనే కాల్పుల విరమణకు పిలుపునిచ్చిందని నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామమే బ్రహ్మోస్‌పై ప్రపంచ దేశాలకు నమ్మకాన్ని పెంచింది.

**పెరిగిన ఉత్పత్తి.. భవిష్యత్ ప్రణాళికలు**


పెరుగుతున్న దేశీయ, అంతర్జాతీయ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని భారత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచింది. హైదరాబాద్, నాగ్‌పూర్, పిలానీలతో పాటు ఇటీవల లక్నోలో కొత్తగా ప్రారంభించిన ప్లాంట్‌లో కూడా ఉత్పత్తి మొదలైంది. ప్రస్తుతం ఈ నాలుగు కేంద్రాల్లో నెలకు కనీసం నాలుగు క్షిపణులను తయారు చేసే సామర్థ్యం ఉండగా, దీనిని మరింత విస్తరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత నావికాదళంలోని ప్రతి ప్రధాన యుద్ధనౌక, వాయుసేనలోని ప్రతి ఫైటర్ జెట్‌ను బ్రహ్మోస్‌తో సన్నద్ధం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**బ్రహ్మోస్ ప్రస్థానం**

బ్రహ్మోస్ ప్రాజెక్టుకు 1997లో అంకురార్పణ జరిగింది. అప్పటి డీఆర్‌డీఓ చీఫ్ ఏపీజే అబ్దుల్ కలాం నేతృత్వంలోని ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భూమికి సమీపంగా ప్రయాణించే క్రూయిజ్ క్షిపణి లోటును గుర్తించారు. ఈ క్రమంలోనే రష్యాతో కలిసి బ్రహ్మోస్ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. డీఆర్‌డీఓ, రష్యాకు చెందిన ఎన్‌పీఓ మషినోస్ట్రోయేనియా (ధీూ మీుంప్టఱఅశీర్‌తీశీఎవఅఱఖు) సంయుక్త భాగస్వామ్యంతో 'బ్రహ్మోస్ ఏరోస్పేస్' ఏర్పడింది. తొలినాళ్లలో 'పీజే-10' అనే కోడ్‌నేమ్‌తో అత్యంత రహస్యంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశారు.

మరోవైపు, బ్రహ్మోస్‌లో కొత్త వేరియంట్ల అభివృద్ధిపై కూడా శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. నీటి అడుగున ప్రయోగించే సామర్థ్యమున్న వెర్షన్, తేలికైన మినీ వేరియంట్‌ను రూపొందించే పనులు కొనసాగుతున్నాయి. భవిష్యత్తులో పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో బ్రహ్మోస్‌ను తయారు చేసి, తేజస్, ఎల్‌సీఏ ఎంకే 2 వంటి దేశీయ యుద్ధ విమానాలకు అనుసంధానించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది రక్షణ రంగంలో స్వావలంబన సాధించే దిశగా భారత్ చేస్తున్న ప్రయత్నాలకు మరింత బలాన్ని చేకూర్చనుంది.

0




బుద్వేల్ కోట మైసమ్మ దేవాలయంలో అమ్మ వారిని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు పెండ్యాల శ్రీధర్, స్థానిక భక్తులు మజ్జిగ అశోక్ యాదవ్, రాములు తదితరులు



బుద్వేల్ గంగ పుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు



రాజేంద్రనగర్ లో ఈదమ్మ భూ లక్ష్మమ్మ దేవాలయంలో అమ్మ వారిని దర్శించుకున్న రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి సురేందర్ రెడ్డి. చిత్రంలో బీజేపీ నాయకులు వై శ్రీధర్ ఆయన సతీమణి తృప్తి, కుమార్తె



బోనంతో చిన్నారి శ్రీనిక రెడ్డి

# రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలలో ఘనంగా బోనాల జాతర ఉత్సవాలు

## రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలలో ఘనంగా బోనాల జాతర ఉత్సవాలు



ఉప్పర్ పల్లి లో తొట్టెల ఊరేగింపు లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ హైదర్ గూడ డివిజన్ అధ్యక్షులు సామ ఇంద్రపాల్ రెడ్డి



మార్కండేయనగర్ లో అమ్మ వారిని దర్శించుకున్న పాత్రికేయులు వర్కాల చందు, రాధిక, శ్రేయాన్, హార్దిక్ లు



శివరాంపల్లి లో అమ్మ వారిని దర్శించుకున్న బీఆర్ఎస్ నాయకులు రాగిశెట్టి ఆనంద్ రెడ్డి



అత్తాపూర్ లో తొట్టెల ఊరేగింపు లో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొండకళ్ల ప్రభాకర్ రెడ్డి. బి ఆర్ ఎస్ నాయకులు జాలిగం చిత్తా రి లు

**బుద్వేల్, ఆగస్టు 9 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లల పరిధిలోని బస్తీలు, కాలనీలలో ఆదివారం బోనాల పండుగ ను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆషాడ మాస బోనాలకు తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకం అయినందున ప్రతి ఒక్కరు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శివరాంపల్లి లో జరిగిన బోనాల ఉత్సవాలలో మాజీ కార్పోరేటర్ పి అర్చన జయప్రకాశ్ తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు. శివరాంపల్లిలోని అమ్మవారి కి బీఆర్ఎస్ నాయకులు రాగిచెట్టి ఆనంద్ రెడ్డి పూజలు చేసారు. రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి సురేందర్ రెడ్డి , రాజేంద్రనగర్ ఈదమ్మ దేవాలయంలో బీజేపీ నాయకులు వై.శ్రీధర్ కుటంబం తో కలసి అమ్మవారిని దర్శించుకున్నారు. హైదర్ గూడ, మార్కండేయనగర్, బాబుల్ రెడ్డినగర్ బస్తీలలో జరిగిన బోనాల వేడుకలలో బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి కార్తీక్ రెడ్డి స్థానిక నాయకులు చెట్టిగారి నరేందర్ రావు, కొలన్ సుబాష్ రెడ్డి, మ్యాడం ప్రీతమ్, కొండమీది హరినాథ్, ఎమ్మార్పీఎస్ నాయకులు వనం నర్సింహ్మా, ఎస్ వెంకటేశ్ లతో కలసి అమ్మవారిని దర్శించుకున్నారు. రాంబాగ్ దుర్గామాత దేవాలయంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు కె ఉమా మహేశ్వరీరెడ్డి అమ్మవారికి బోనం సమర్పించారు. హైదర్ గూడ పరిసర దేవాలయాలలో జరిగిన బోనాల వేడుకలలో అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి తో పాటు సామాజిక కార్యకర్త మ్యాడం మదుసూదన్, వివిధ పార్టీల నాయకులు ఎం కొమురయ్య, ఎన్ మల్లారెడ్డి, కడెం సుదాకర్, ఎస్ జయానంద్ రెడ్డి, నల్లింగ్ రమేశ్ లు పాల్గొన్నారు. అత్తాపూర్ లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొండకళ్ల ప్రభాకర్ రెడ్డి తో పాటు వివిధ పార్టీల నాయకులు జాలిగం చిత్తారి, బుద్వేల్ లో స్థానిక నాయకులు పెండ్యాల శ్రీధర్, రజనీకాంత్ గౌడ్ , రాములు, ఎం అశోక్ యాదవ్, తదితరులు అమ్మ వారిని దర్శించుకున్నారు. బుద్వేల్ కోట మైసమ్మ ఆలయంలో కోరని బాల్రాజ్, కోరని శ్యామ్, ఉత్సవాలలో పాల్గొన్నారు. రాజేంద్రనగర్ శ్రీ మాతా పోచమ్మ అమ్మవారి దేవాలయంలో జరిగిన బోనాల వేడుకలలో భక్తులు డి ఉమారెడ్డి, కొమిరె గణేశ్, పీర్లగూడెం జంగయ్య, పి ఈశ్వర్, కనకమామిడి ప్రవీణ్ కుమార్, ఎం యాదమ్మ యాదవ్, అండాలు, ఎం రాజు, కరణం రఘు ముదిరాజ్, డంగు నర్సింహ్మారాజు, రమేశ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ ఈదమ్మ దేవాలయం వద్ద భక్తులు




హైదర్ గూడ పోచమ్మ దేవాలయం లో అమ్మ వారిని దర్శించుకున్న అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి, స్థానిక నాయకులు



రాజేంద్రనగర్ ఈదమ్మ దేవాలయం లో బోనాల సమర్పణ



హైదర్ గూడ పోచమ్మ దేవాలయం వద్ద అమ్మ వారిని దర్శించుకున్న బి ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి, నాయకులు కోలన్ సుభాష్ రెడ్డి తదితరులు



రాజేంద్రనగర్ పోచమ్మ దేవాలయం వద్ద భక్తులు



మార్కండేయ నగర్ లో అమ్మవారిని దర్శించుకున్న బి ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి, నాయకులు ఎస్ వెంకటేష్, అక్కెం రాఘవేందర్ యాదవ్, ఎర్ర సత్యనారాయణ, బండ రాజేష్ యాదవ్ తదితరులు

## రాజేంద్రనగర్ చింతల్ మెట్ లో జరిగిన బోనాల జాతర లో పాల్గొన్న ముస్లిం మైనారిటీ నాయకులు మహ్మద్ గౌస్





డాక్టర్ బి నిర్మల ను సన్మానిస్తున్న రాజేంద్రనగర్ శ్రీ మాత పోచమ్మ దేవాలయం కమిటీ సభ్యులు

## ఎన్ఎఎస్ఐ సభ్యురాలుగా నియమితులైన డాక్టర్ బి నిర్మలకు సన్మాణం

**బుద్వేల్, ఆగస్టు 9 (ప్రభాత ఉదయం)**

భారత దేశంలోని నేషనల్ అకాడమి ఆఫ్ సైన్సెస్ సభ్యురాలు గా నియమితులైన రాజేంద్రనగర్ నివాసి డాక్టర్ బి నిర్మల ను ఆదివారం స్థానిక శ్రీ మాత పోచమ్మ దేవాలయ కమిటీ సభ్యులు సన్మానించారు. డాక్టర్ బి నిర్మల రాజేంద్రనగర్ లోని నవజ్యోతి యూత్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులలో ఒకరైన దివంగత బి నర్సింహ్మా కుమార్తె అని గుర్తు చేసుకున్నారు. డాక్టర్ బి నిర్మల ప్రస్తుతం రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమి ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ (నార్మ్) లో ప్రిన్సిపల్ సైంటిస్ట్ గా కొనసాగుతున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) కు దేశ వ్యాప్తంగా 114 అనుబంధ సంస్థలు ఉండగా జాతీయ స్థాయిలో ఉన్న నేషనల్ అకాడమి ఆఫ్ సైన్సెస్ లో కేవలం ముగ్గురు మాత్రమే మహిళా శాస్త్రవేత్తలు ఉండటం, అందులో రాజేం ద్రనగర్ కు చెందిన డాక్టర్ బి నిర్మల ఉండటం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో డాక్టర్ బి నిర్మల మరిన్ని ఉన్నత పదవులు అదిరోహించాలని అమ్మవారిని వేడుకుంటున్నామన్నారు. సన్మానం చేసిన వారి లో దేవాలయ కమిటీ కి చెందిన జి రాములు, ఎం యాదమ్మ యాదవ్. మహాత్మారావు, కొమిరె గణేశ్, రమేశ్ తదితరులున్నారు.




## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు 9( ప్రభాత ఉదయం)**

అయిజ మండలంలో చిన్న తాండ్ర పాడు గ్రామ శివారులోని బోయ తిరుమల్ కు చెందిన మామిడి తోటలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు ఆదివాదం ఎస్ఐ గురుస్వామి ఆధ్వర్యంలో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించగా ఆరుగురు పేకటారాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 9,110 నగదు, 6 సెల్ ఫోన్లు, 2 మోటార్ సైకిల్, 1 కారు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు.




# జూరాల గేట్లు మూసివేత

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు9 (ప్రభాత ఉదయం)**

మహారాష్ట్ర, కర్ణాటకలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంలో నుంచి జూరాల డ్యాంకు వరద ఉధృతి క్రమంగా తగ్గుముఖం పట్టింది. దీంతో జూరాలకు వస్తున్న వరద ఉధృత్తిని దృష్టిలో పెట్టుకుని జూరాల గేట్లు మూసి వేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రానికి 57,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. విద్యుదుత్పత్తి కోసం 44,279 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు. డ్యాం నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.531 టీఎంసీలు నిల్వ ఉన్నది. నెట్టెంపాడు లిఫ్ట్, భీమా లిఫ్ట్-1, కుడి, ఎడమ, సమాంతర కాలువకు నీటిని వదులుతున్నారు. దీంతో ప్రాజెక్టు నుంచి మొత్తంగా 48,123 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది.

**ఆగిన అలల సవ్వడి**

శనివారం వరకు భారీ వరద ఉధృతితో గలగలపారే కృష్ణమ్మ సవ్వడి చేస్తూ దిగువకు పరుగులెత్తింది. నిండుకుండలా మారిన ప్రాజెక్టు, ఉగ్రరూపంతో



పొంగిపొర్లుతున్న కృష్ణమ్మ సౌందర్యాన్ని, జలపాతాలను తలపించే నీటి ధారలను తిలకించేందుకు సందర్శకులు, పర్యాటకులు పెద్ద ఎత్తున పోటెత్తారు.

అయితే ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గడంతో ప్రాజెక్టుకు వచ్చే వరద నీటి ప్రవాహం క్రమంగా తగ్గుముఖం పట్టింది. దీంతో ప్రాజెక్టు అధికారులు క్రస్ట్ గేట్లను మూసివేశారు.

ఎగువ పరివాహక ప్రాంతాల్లో మళ్లీ వర్షాలు కురిసి ఇన్ ఫ్లో పెరిగితే, పరిస్థితికి అనుగుణంగా తిరిగి గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తామని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.





## మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ఘనంగా బోనాల వేడుకలు

### పలు అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

**రాజేంద్రనగర్,ఆగస్టు09(సూర్యరేఖ):**

తెలంగాణ రాష్ట్ర విశిష్ట పండుగైన ఆషాఢ బోనాల సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని కాటేదాన్,బుద్వేల్,మధుబన్ కాలనీ,పద్మశాలిపురం ప్రాంతాల్లో ఆదివారం పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మైలర్‌దేవ్‌పల్లి పరిధిలోని పలు అమ్మవారి దేవాలయాలను సందర్శించారు.ఉదయం వివిధ దేవాలయాలకు చేరుకున్న ఎమ్మెల్యే అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో ఉండాలని,రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు,పెద్ద సంఖ్యలో భక్తులు,మహిళలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.





## కురుమూర్తి రాయ ఎత్తిపోతల పథకం నుండి కాలువలకు నీటిని

# విడుదల చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్





**దేవరకద్ర , ఆగస్టు9(ప్రభాత ఉదయం)**

మదనపురం మండలం కొత్తపల్లి గ్రామంలో నేడు కురుమూర్తి రాయ ఎత్తిపోతల పథకం నుండి స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి మోటార్లు ఆన్ చేసి దుప్పల్లి, కొత్తపల్లి, అమ్మాపూర్, కురుమూర్తి గ్రామాలకు దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ నీటిని విడుదల చేశారు.అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ...కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎగువ నుండి వస్తున్న వరద సమాచారం మేరకు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి దిగువకు నీటిని విడుదల చేస్తున్నామని అన్నారు, అందులో భాగంగా ఇప్పటికే కోయిల్ సాగర్, నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా ఫేజ్ 1, భీమా ఫేజ్ 2, ద్వారా నీటిని విడుదల చేసామని అన్నారు.మొత్తం 811 టీఎంసీల కృష్ణా జలాలను 512 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్‌కు, తెలంగాణకు కేవలం 299 టీఎంసీలు మాత్రమే కేటాయించబడిన సమయంలో అధికారంలో ఉన్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు.కృష్ణా పరివాహక ప్రాంతంలో దాదాపు 67 శాతం తెలంగాణలో, ముఖ్యంగా పాలమూరు జిల్లాలో ఉన్నప్పటికీ రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అప్పట్లో బిఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు పోరాడలేదని ప్రశ్నించారు.పోతిరెడ్డిపాడు విస్తరణ జరిగినప్పుడు, భారీగా నీళ్లు ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోతున్న సమయంలో బీఆర్ఎస్ నాయకులు ఎందుకు స్పందించలేదని ఈ సందర్భంగా నిలదీశారు.తమ గత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రజాప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తే, ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు.రైతులకు ఎప్పుడు, ఎంత నీరు విడుదల చేయాలన్నది అధికారుల సాంకేతిక సూచనలు, నీటి లభ్యత, రైతుల అవసరాల ఆధారంగా ప్రభుత్వం నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.రైతుల ప్రయోజనాల పరిరక్షణలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడదని పేర్కొన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు అబద్ధాల ప్రచారం, ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలను మానుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ హితవు పలికారు.అనంతరం కొత్తపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే జియంఆర్ శంకుస్థాపన చేశారు.



## రామకృష్ణాపురం గ్రామంలో

# గంగమ్మ తల్లి తెప్పోత్సవం

**కొత్త కోట, ఆగస్టు 9 ( ప్రభాత ఉదయం)**

మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో సర్పంచ్ ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఊర చెరువులో గంగమ్మ తల్లికి తెప్పోత్సవం వరద పాశం కార్యక్రమాన్ని గ్రామ పెద్దలు యువకులు అందరితో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో రైతులు సంతోషంగా ఉండాలని కోరుకున్నారు . ఈ కార్యక్రమంలో పెద్దలు మూలమల్ల యుగంధర్ రెడ్డి , మాజీ వైస్ ఎంపీపీ బి రాములు ,మాజీ ఉప సర్పంచ్ కావలి జగతి వార్డ్ సభ్యులు అబ్దుల్ గఫార్ , బి. మొగులన్న యాదవ్ మాజీ వార్డు సభ్యులు భరత్ యాదవ్, రాము, జయరాజ్ యాదవ సంఘం అధ్యక్షులు ఎం. నరసింహ యాదవ్ నాయకులు బి.సత్యనారాయణ రెడ్డి, బి. భాస్కర్ యూదవ్, బి.శ్రీనువాస్, యం.శివ ,ఆర్ నరసింహ ఎం భరత్, బి. నరసింహ ఎం రాజు , నిరంజన్, బి.రాములు, నరసింహ, రాజు , యస్. మొగులన్న, పెద్ద భారతయ్య, శివ, సి.మొగులన్న, యస్.మొగులన్న, కృష్ణ, చంద్రమౌళి, రాములు,అల్లన్న గ్రామ రైతులు , యువకులు , ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సీత మొగులన్న



## కొత్తకోట బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

**కొత్తకోట, ఆగస్టు 9(ప్రభాత ఉదయం)**

కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిచెన్‌ను, విద్యార్థినులకు అందిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రత ను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ, కళాశాలలోని మౌలిక వసతులను, భోజనం యొక్క నాణ్యతను, కళాశాలలో వసతికి సంబంధించిన సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి భోజనం, మెరుగైన వసతులు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు. బాలికల విద్య, సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కోరారు. అనంతరం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను పరిశీలించి, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను, అధికారులను ఎమ్మెల్యే జియంఆర్ ఆదేశించారు.





## వ్యాపార సముదాయం నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు, ఆగస్టు 9 (ప్రభాత ఉదయం):**

జెపి కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ బండల మల్లన్న దేవాలయం పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న వ్యాపార సముదాయం స్లాబ్ నిర్మాణ పనులను ఆదివారం ఉదయం పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి, నిర్వహణ కోసం సొంత నిధులతో వ్యాపార సముదాయ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆల్విన్ కాలనీ ఎల్లమ్మ తల్లి, పోచమ్మ తల్లి దేవాలయాలలో నిర్వహించిన ఆషాడమాసం బోనాల ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మల్లేష్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## రైల్వే లైన్ విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెక్కుల పంపిణీ

### రైతులకు చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ డీకే అరుణ, దేవరకద్ర ఎమ్మెల్యే జియంఆర్

**కొత్త కోట, ఆగస్టు 9 (ప్రభాత ఉదయం)**

మదనపురం మండలం కొన్నూరు గ్రామంలో రైల్వే లైన్ విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెక్కులను ఎంపీడీకే అరుణ, దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పరిహారం కు సంబంధించిన చెక్కులను మహబూబ్ నగర్ ఎంపీ డికె. అరుణ తో కలిసి అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ...రైతుకు భూమి కేవలం ఆస్తి కాదని, అది వారి జీవనాధారం, కుటుంబ భవిష్యత్తు, పిల్లల భవిష్యత్తుతో ముడిపడి ఉంటుందని అన్నారు.రైల్వే డబుల్ లైన్ కోసం భూములు కోల్పోతున్న రైతుల త్యాగాన్ని ప్రభుత్వం గుర్తించుకుంటుందని పేర్కొన్నారు.మన ప్రాంతంలో 80--85 శాతం మంది సన్నకారు, చిన్నకారు రైతులేనని, చాలా మంది రైతులకు అర ఎకరం, ఎకరం, రెండు ఎకరాలు, మూడు ఎకరాల వరకు మాత్రమే భూమి ఉంటుందని, దానిని కోల్పోవడం ఎంత బాధాకరమో మనం అర్థం చేసుకోవాలని అన్నారు. రైల్వే డబుల్ లైన్ వంటి ప్రజా అవసరాల కోసం భూసేకరణ చేయాల్సిన పరిస్థితులు వచ్చినప్పుడు, భూములు కోల్పోయే రైతులకు న్యాయమైన పరిహారం అందించడం ప్రభుత్వ బాధ్యత అని ఎమ్మెల్యే జియంఆర్ స్పష్టం చేశారు.ఏడు గ్రామాల పరిధిలో రైల్వే డబుల్ లైన్ కోసం సుమారు 23 ఎకరాల 25 గుంటల భూమిని రైల్వే, రెవెన్యూ అధికారులు భూసేకరణ ప్రక్రియ ద్వారా సేకరించారని, ఈ ప్రక్రియలో అనేక మంది సన్నకారు, చిన్నకారు రైతులు తమ భూములను కోల్పోయారని, వారికి పరిహారంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు.ప్రజా ప్రయోజనం కోసం తమ భూమి పోయినా పర్వాలేదు.. రైల్వే డబుల్ లైన్ వస్తే మన ప్రాంతానికి ఎంతో ఉపయోగపడుతుందని, ప్రజలకు రవాణా సౌకర్యం పెరుగుతుందని, మన ప్రాంతం అభివృద్ధి చెందుతుంది" అనే గొప్ప ఆలోచనతో రైతులు ముందుకు రావడం అభినందనీయమన్నారు.ప్రస్తుత భూమి విలువలతో పోలిస్తే ప్రభుత్వం నిబంధనల ప్రకారం అందిస్తున్న పరిహారం సరిపోదన్న రైతుల ఆవేదనను తాను కూడా అర్థం చేసుకుంటున్నానని, రైతులకు పరిహారం పెంచే మార్గాలపై కలెక్టర్‌తో చర్చిస్తానని తెలియజేశారు.భూసేకరణకు సంబంధించిన కొన్ని నిబంధనలు కేంద్ర ప్రభుత్వం, రైల్వే శాఖ పరిధిలో ఉంటాయని రైతులకు పరిహారం పెంచే మార్గాలపై ఎంపీ డి కె అరుణ రైల్వే, కేంద్ర అధికారులతోనూ మాట్లాడాలని సూచించారు.అదేవిధంగా మదనపురం రైల్వే గేట్ వద్ద మదనపురం కొత్తకోట ఆత్మకూరు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఈ రోడ్డును డబుల్ లైన్ నిర్మాణానికి రోడ్లు భవనాల శాఖ మంత్రి శంకుస్థాపన చేశారని, కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ఇక్కడ ఆర్ఓబి మంజూరు చేయించాలని ఎంపీ డి కె అరుణ ను ఎమ్మెల్యే జియంఆర్ కోరారు.ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, రెవెన్యూ అధికారులు, తహసీల్దార్, గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కేటీదొడ్డిలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా'

## రైతు కూలీలకు జాతీయ జెండాల వితరణ




**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 9(ప్రభాత ఉదయం,)**

దేశభక్తి స్ఫూర్తిని ప్రతి ఇంటికీ చేరవేయడమే లక్ష్యంగా బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు, పాలమూరు ఎంపీ డీకే అరుణ ఆదేశాల మేరకు ఆదివారం కేటీ దొడ్డి మండల కేంద్రంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులుపొలాల్లో వరి నాట్లు వేస్తున్న రైతులకు, రైతు కూలీలకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రతి భారతీయుడికీ జాతీయ జెండాతో అనుబంధం పెరిగిందన్నారు.దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న శ్రమజీవులైన రైతులు, కూలీల చేతుల్లో జాతీయ జెండాను ఉంచడం గర్వకారణమని పేర్కొన్నారు.గద్వాల జిల్లాలో సాగునీటి వసతులు మెరుగుపడటానికి పాలమూరు ఎంపీ డీకే అరుణ చేసిన కృషి అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీపాదరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, పాగుంట సర్పంచ్ అంజనప్ప, నాయకులు గోవిందు, డి. వీరేష్, ముంగిలి వీరేష్, నాగిరెడ్డి, అంపిరెడ్డి, సిద్దు, రాఘు, ఉమిత్యాల కొండన్న, తిమ్మప్ప, గోపి, రామకృష్ణ, నాని తదితరులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరులో మంగళవారం టియుడబ్ల్యుజె ఐజెయు నియోజకవర్గ సమావేశం

**పటాన్‌చెరు ఆగస్టు 9 ( ప్రభాత ఉదయం):**



తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ టియుడబ్ల్యుజె ఐజెయు ఆధ్వర్యంలో పటాన్‌చెరు నియోజకవర్గ సమావేశం ఆగస్టు 11న మంగళవారం ఉదయం 11 గంటలకు రామచంద్రాపురంలోని లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రుమాండ్ల అనిల్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పటాన్ చెరు నియోజకవర్గానికి టియుడబ్ల్యుజె ఐజెయు కార్యవర్గాన్ని ఎన్నుకునే ఉద్దేశంతో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి టియుడబ్ల్యుజె ఐజెయు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎకె ఫైజల్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. జర్నలిస్టుల సమస్యలు, సంఘం బలోపేతం, నియోజకవర్గ స్థాయిలో కార్యవర్గ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టులందరూ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

# జూరాల వద్ద పోటెత్తిన పర్యాటకులు

## కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారుల విఫలం

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు 9(ప్రభాత ఉదయం)**



వరుస సెలవుదినాలు రావడంతో ఆదివారం ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్‌కు సందర్శకుల తాకిడి విపరీతంగా పెరిగింది. కృష్ణమ్మ సౌందర్యాన్ని వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సందర్శకులు కృష్ణానది ప్రవాహాన్ని తిలకిస్తూ, సెల్ఫీలు దిగుతూ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడిపారు.ఆదివారం సందర్శకుల రద్దీ ఎక్కువగా ఉండటంతో పాటు, డ్యామ్‌పైనే వాహనాలు నిలపడంతో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న అమరచింత, ధరూర్ పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

**పర్యాటకులకు నిరాశ -- అధికారులపై అసహనం**

ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం తగ్గడంతో అధికారులు డ్యామ్ గేట్లను మూసివేశారు. దీంతో నీటి ఉధృతిని చూడాలని ఆశగా వచ్చిన పర్యాటకులకు నిరాశే మిగిలింది. గేట్లు మూసివేసినప్పటికీ, సందర్శకులు నదీ తీరాన సమయం గడుపుతూ స్థానిక చేపల వంటకాలను ఆస్వాదించారు.

అయితే, ఇంతటి ప్రముఖ పర్యాటక ప్రాంతమైన జూరాల వద్ద తాగునీరు, నీడ, శౌచాలయాలు వంటి కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడంపై పర్యాటకులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, ప్రాజెక్టు అధికారులు తక్షణమే స్పందించి జూరాల వద్ద పర్యాటకులకు అవసరమైన ప్రాథమిక వసతులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## పెద్ద చింతరేవులలో పీఠాధిపతులచే ఏకాదశి ప్రత్యేక పూజలు

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు9 (ప్రభాత ఉదయం)**



ధరూర్ మండల పరిధిలోని పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం నాడు ఉత్తరాది మఠం ఉడిపి,పాలిమర్ పీఠాధిపతులు శ్రీ 1008 విద్యాదీశ తీర్థ శ్రీపాదుల వారు, శ్రీ 1008 విద్యా రాజేశ్వర తీర్థ శ్రీపాదుల వారు కామిక ఏకాదశి ప్రత్యేక పూజలు ఆంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు. కామిక ఏకాదశి విశిష్టతను వివరిస్తూ కోరికలు నెరవేరుటకు ఈరోజు ఉపవాస దీక్ష చేసిన వారికి మహావిష్ణువు యొక్క కృపా కటాక్షాలు కలుగుతాయని తెలిపారు.శ్రీ మహావిష్ణువు యోగ నిద్రలోకి వెళ్లిన నాలుగు నెలల కాలంలో వచ్చేతొలి ఏకాదశి కావడంతో దీనిని విశేషంగా పరిగణిస్తారని అన్నారు.శ్రీహరిని ఆరాధించటం తులసి దళాలతో పూజ,దానం చేయటం ఈ ఏకాదశి ప్రత్యేకతలు అని తెలిపారు.ఉపవాసం ఉండి దైవచింతనలో స్వామివారికి దగ్గరగా ఉండడం విశేష ఫలితం అని తెలిపారు.వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు పెద్ద చింతరేవుల అన్నప్రసాద కమిటీ వారిచే ఏర్పాటుచేసిన అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్తరాది మఠం పీఠాధిపతులు సెప్టెంబర్ 25 వరకు పెద్ద చింతరేవులలో చాతుర్మాస్య దీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.ప్రతిరోజు రామాయణం,భాగవత ప్రవచనాలు కార్యక్రమం ఉదయం 10.30నుండి 11.30వరకు ఉంటున్నట్లు తెలిపారు.ఆలయ ఆవరణలో ప్రతిరోజు పవమాన హోమం, నవగ్రహ హోమం కోరిన భక్తులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అర్చకులు ఆద్యవామనాచారి, ఆద్య కిష్టాచారి, ఆద్యమద్వాచారి,వివిధ ప్రాంతాల నుండి భక్తులు మహిళలు పాల్గొన్నారు.



## ఐడిఎలో ఘనంగా బోనాల పండుగ వేడుకలు

**పటాన్ చెరు, ఆగస్టు 9 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ సంస్కృతిలో భాగమైన బోనాల వేడుకల సందర్భంగా బొల్లారం డివిజన్ పరిధిలోని ఐడిఎ బొల్లారం కాలనీలో జిన్నారం మాజీ ఎంపీపీ కొలన్ రవీందర్ రెడ్డి,బొల్లారం బీసీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బత్తుల శ్రీశైలం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా బోనాల ఉత్సవాలు ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా కాలనీ ప్రజలతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. పూర్వీకుల నుంచి కొనసాగుతున్న ఈ గొప్ప సంప్రదాయాలను భావితరాలకు అందిస్తూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులు అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాదగిరి, స్థానిక నాయకులు పరశురామ్, చిరంజీవి, నవీన్ రెడ్డి, శివకృష్ణ, హరికృష్ణ, ప్రతాప్ రెడ్డి, పురుషోత్తం, వడ్డే రాము, విక్కీ అగర్వాల్, కాలనీ ప్రజలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## బొల్లారంలో ఘనంగా బోనాల పండుగ వేడుకలు

**పటాన్ చెరు, ఆగస్టు 9 (ప్రభాత ఉదయం):**

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిరూపంగా ప్రతి ఏటా నిర్వహించే బోనాల పండుగ జాతర వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. బొల్లారం డివిజన్ పరిధిలోని పోచమ్మబస్తీలోని పోచమ్మ గుడిలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి, భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు స్థానికులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. అదేవిధంగా వైఎస్సార్ కాలనీలోని చిత్తారమ్మ గుడి దగ్గర బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు ఏర్పాటు చేశారు. ఆయా ఆలయాల్లోని పూజల్లో గ్రామపెద్దలు, రాజకీయ నాయకులు స్థానికులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.





## గద్వాలలో "మహేష్ మేన్స్ వేర్" ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 9(ప్రభాత ఉదయం)**

గద్వాల పట్టణం భీంనగర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన "మహేష్ మేన్స్ వేర్" వస్త్ర దుకాణాన్ని ఆదివారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం దుస్తులు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో గద్వాల

మున్సిపల్ ఛైర్పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహులు, వార్డు కౌన్సిలర్ వేదావతి వెంకటేశ్వర్ రెడ్డి,చంద్రశేఖర్, సత్యం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మెన్స్ వేర్ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు, పాల్గొన్నారు.




## 'హర్ ఘర్ తిరంగా'ను జయప్రదం చేద్దాం

### కెజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి

**పటాన్ చెరు, ఆగస్టు 9( ప్రభాత ఉదయం):**



భారత దేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన 'హర్ ఘర్ తిరంగా' పిలుపును ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని బిజెపి పట్టణ అధ్యక్షుడు సామాజిక కార్యకర్త, ప్రజాసేవకుడు కె.జె.ఆర్. ఆనంద్ కృష్ణారెడ్డి కోరారు. ఆగస్టు 9 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు.బొల్లారం జీహెచ్ఎంసీ 272 డివిజన్ పరిధిలో జాతీయ జెండాలు అందుబాటులో లేని ప్రజలకు స్థానిక బీజేపీ కార్యాలయం వద్ద ఉచితంగా జెండాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని ఆనంద్ కృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ఆహారం విషయంలో విద్యార్థుల మధ్య ఘర్షణ

**పోలీసులకు పిర్యాదు చేసిన పాఠశాల సిబ్బంది**

**లివిద్యార్థులను చితక బాది**

**అత్యుత్సాహం చూపిన కానిస్టేబుళ్లు**

**ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన**

**పటాన్ చెరు, ఆగస్టు 9 (ప్రభాత ఉదయం):**





జిన్నారం మండల పరిధిలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కాలేజీలోని విద్యార్థుల మధ్య అర్థరాత్రి గ్యాంగ్ వార్ చోటుచేసుకుంది. ఆహారం తీసుకునే విషయంలో తలెత్తిన వివాదం చిలికిచిలికి గాలివాన అయినట్లు తెలుస్తోంది. ఇంటర్, పదోతరగతి విద్యార్థులు ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటుండగా గమనించిన పాఠశాల నిర్వాహకులు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు.శనివారం రాత్రి పది గంటలకు విద్యార్థులు ఘర్షణకి దిగిన నేపథ్యంలో డయల్ 112 కి ఫోన్ వైస్ ప్రిన్సిపాల్ సుజేంద్ర కుమార్, జూనియర్ లెక్చరర్ సృజన్ లు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు పాఠశాలలోని సుమారు 30 మంది విద్యార్థులను ఇష్టం వచ్చినట్టు కొట్టినట్లు తెలుస్తోంది. జిన్నారం పోలీస్ స్టేషన్ కు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు విద్యార్థులను చితక బాదినట్లు తోటి విద్యార్థులు చెపుతున్నారు. దీంతో పోలీసుల తీరుపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు ఈవిషయం గురించి జిన్నారం ఎస్సైకి చెబితే ఇంకా ఎక్కువ కొట్టాల్సింది అని అన్నారని విద్యార్థులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో ఘటన జరగటంతో కొందరు విద్యార్థులు వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.